# పదోతరగతి సాంఘికశాస్త్రం

## భారతదేశ నదులు, నీటి వనరులు

**1.** తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతంలో నీటి వనరులకు సంబంధించి ఎదుర్కొంటున్న సవాళ్లు ఏవి? *(వి. అ. 4 మార్కులు)*

జ: తుంగభద్ర నది కృష్ణానదికి ఉపనది. ఈ నదీజలాలను కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పంచుకుంటున్నాయి. దీని మొత్తం పరీవాహక ప్రాంతం 71,417 చదరపు కిలో మీటర్లు అయితే ఇందులో 57,671 చదరపు కిలోమీటర్లు కర్ణాటకలో ఉంది.

ఎదుర్కొంటున్న సవాళ్లు:

★ గత కొద్ది దశాబ్దాల నుంచి తుంగభద్ర ఆనకట్ట నీటి నిల్వ సామర్థ్యం తగ్గడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.

★ ఈ నదీ పరీవాహక ప్రాంతంలో జనాభా పెరగడం, పారిశ్రామికీకరణ అభివృద్ధి చెందడంతో నీరు సరిపడినంతగా అందడం లేదు.

★ గనుల తవ్వకం, దుమ్ము, నేలకోత, వ్యర్థ పదార్థాల వల్ల రిజర్వాయరు మేటవేసి, నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుంది.

★ పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం బాగా పెరిగింది.

★ ఇనుప ఖనిజం తవ్వకంలో సరైన ప్రామాణికాలు పాటించడం లేదు.

★ కుద్రేముఖ్‌లో ఇనుప ఖనిజం, శాండూర్ వద్ద మాంగనీస్ తవ్వకాల వల్ల పరీవాహక ప్రాంతంలో నేలకోత ఎక్కువైంది.

★ దీని వల్ల సంప్రదాయ చెరువులు, చిన్న జలాశయాలు, తుంగభద్ర జలాశయం పూడికకు గురవుతున్నాయి.

★ తక్కువగా లభించే నీటి వనరులను సక్రమంగా వినియోగించుకోలేకపోతున్నారు.

★ రాష్ట్రాల మధ్య నీటి వనరుల పంపకానికి సరైన ప్రణాళికలు లేకపోవడం వల్ల అంతర్రాష్ట్ర వివాదాలు వస్తున్నాయి.

**2.** కింది పట్టికను పరిశీలించి ప్రశ్నలకు జవాబులు రాయండి. *(స.నై. 4 మార్కులు)*

| భారతదేశంలోని ప్రధాన నదీ వ్యవస్థలు | |
|---|---|
| **అంశాలు** | **నదీ వ్యవస్థలు** |
| నది ప్రవహించే దిశ | **సింధు:** ఉత్తరం నుంచి వాయవ్యానికి<br>**గంగ:** ఉత్తరం నుంచి ఈశాన్యానికి<br>**బ్రహ్మపుత్ర:** ఉత్తరం నుంచి ఈశాన్యానికి<br>**ద్వీపకల్ప నదులు:** పడమర నుంచి తూర్పుదిశకు (నర్మద, తపతి తప్ప)<br>**నర్మద, తపతి:** తూర్పు నుంచి పడమరకు |
| నదులు ప్రవహించే ప్రాంతం | **సింధు:** పాకిస్థాన్, టిబెట్ (చైనా), భారత్<br>**గంగ:** భారతదేశం, బంగ్లాదేశ్<br>**బ్రహ్మపుత్ర:** భారత్, బంగ్లాదేశ్<br>**ద్వీపకల్ప నదులు:** భారతదేశం |

**1. అరేబియా సముద్రంలో కలిసే ద్వీపకల్ప నదులేవి?**

జ: నర్మద, తపతి అరేబియా సముద్రంలో కలిసే ద్వీపకల్ప నదులు.

**2. మూడు దేశాల మీదుగా ప్రవహిస్తున్న నది ఏది?**

జ: సింధునది మూడు దేశాల మీదుగా ప్రవహిస్తోంది.

**3. కొన్ని ద్వీపకల్ప నదులు పడమర నుంచి తూర్పుదిశగా ఎందుకు ప్రవహిస్తున్నాయి?**

జ: దక్కన్ పీఠభూమి పడమర నుంచి తూర్పుదిశకు కొద్దిగా వాలి ఉండటం వల్ల ఆ నదులు పడమర నుంచి తూర్పుదిశకు ప్రవహిస్తున్నాయి.

**4. ఏ దేశంలో గంగా, బ్రహ్మపుత్ర నదులు కలుస్తున్నాయి?**

జ: బంగ్లాదేశ్‌లో గంగా, బ్రహ్మపుత్ర నదులు కలుస్తున్నాయి.

**3.** కింది 'గంగ, బ్రహ్మపుత్ర సంగమం' పటాన్ని పరిశీలించి ప్రశ్నలకు సమాధానాలు రాయండి.
*(ప.నై. 2 మార్కులు)*




**1.** **భారతదేశానికి ఉత్తరాన ఉన్న పొరుగుదేశాలేవి?**

జ: నేపాల్, భూటాన్, చైనా భారతదేశానికి ఉత్తరాన ఉన్న పొరుగు దేశాలు.

**2.** **గంగానదికి ఉన్న నాలుగు ఉపనదులను తెలపండి.**

జ: యమున, గోమతి, గండక్, కోసి గంగానదికి ఉపనదులు.

**4.** **భూగర్భజలాలు అందరికీ చెందిన వనరులు – వ్యాఖ్యానించండి.** *(ఇ.పా.చ.వ్యా. 2 మార్కులు)*

జ: భూగర్భజలాలు అందరికీ చెందిన వనరులు అయినప్పటికీ ప్రస్తుతం దీనిపై నియంత్రణ చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఈ మధ్యకాలంలో వీటి వాడకం బాగా పెరిగింది. మానవ తప్పిదాల వల్ల భూగర్భ జలాలు తరిగిపోతున్నాయి. కాబట్టి వీటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ప్రస్తుతం నీటి వినియోగంపై ఉన్న చట్టాలు బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టినవి. కాలానుగుణంగా వాటిని మార్చాల్సిన అవసరం ఉంది. ఇప్పుడున్న చట్టాలు భూగర్భజలాలను అన్ని వనరులతో కలిపి వినియోగించుకున్నప్పుడు తయారుచేసినవి. కాబట్టి పాతబడిపోయిన చట్టాలను మార్చి భూగర్భజలాలను కాపాడుకోవాలి. అందరికీ అందేలా భూగర్భజలాలను పెంచాలి.

**5.** **ప్రస్తుతం మన ముందున్న నీటి సమస్యలు ఏవి?** *(స.అ.ప్ర.ప్ర. 1 మార్కు)*

జ: వివిధ కారణాల వల్ల నీరు కలుషితమవడం.

★ విచక్షణారహితంగా నీటిని వినియోగించడం.

★ నీటి వనరులు తరిగిపోవడం.

**6. 'ఆదర్శ గ్రామ పథకం' కింద మహారాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన గ్రామమేది?** *(వి.అ.1 మార్కు)*

జ: ఆదర్శ గ్రామ పథకం కింద మహారాష్ట్ర ప్రభుత్వం 'హివారే బజారు'ను ఎంపిక చేసింది.

**7. నీటి ప్రవాహాన్ని ఎలా కొలుస్తారు?** *(వి.అ.1 మార్కు)*

జ: నీటి ప్రవాహాన్ని నిమిషానికి లీటర్లలో కొలుస్తారు.

**8. అంతర్గత ప్రవాహం, ఉపరితల ప్రవాహం అంటే ఏమిటి?** *(వి.అ.1 మార్కు)*

జ: ఏ ప్రాంతానికైనా అంతర్గత ప్రవాహాలు = అవపాతం + ఉపరితల ప్రవాహం + భూగర్భ ప్రవాహం.

★ ఉపరితల ప్రవాహం అంటే భూమి మీద వాగులు, కాలువలు లాంటి వాటిల్లోని నీటిప్రవాహం.

**రచయిత: బొమ్మిడి నారాయణరావు**

www.eenadupratibha.net
www.eenadupratibha.net